క్లుప్తంగా

వైభవంగా శ్రీజగన్నాథ రథయాత్ర



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులు

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం వైభవంగా జరిగింది. భగీరథ కాంప్లెక్స్‌లోని శ్రీ పూరీ జగన్నాథ మందిరం ప్రాంగణంలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ఊరేగించారు. హరినామ సంకీర్తన, మహారాజభోగ హారతి, ఆశీర్వాదం, మహా ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు ప్రత్యేక ప్రవచనం చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గురుపూర్ణిమ ముఖ్యమైన వేడుక



మాట్లాడుతున్న బయ్యా వాసు

కర్నూలు కల్చరల్: సమాజ జీవితంలో గురుపూర్ణిమ చాలా ముఖ్యమైన పండుగ అని ఏపీ ప్రాంత ప్రచార ప్రముఖ్ బయ్యా వాసు అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక ఆధ్వర్యంలో ఆదివారం వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో గురుపూజోత్సవ వేడుక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంతో పాటు మొత్తం మానవ జాతికి మార్గనిర్దేశం చేసిన వేద వ్యాసుడు ప్రపంచానికి గురువు అయ్యాడన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త సోమా సుధీర్, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ చాలక్ వెంకటరెడ్డి, నగర సంఘచాలక్ డాక్టర్ చల్లా వాసురెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్రాలకు అప్పగించాలి



ఎంపీకి వినతిపత్రమిస్తున్న నాయకులు

కర్నూలు(సెంట్రల్) : నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యత రాష్ట్రాలకు అప్పగించేలా లోక్‌సభలో పోరాటం చేయాలని పీడీఎస్‌యూ నాయకులు కర్నూలు ఎంపీ బి.నాగరాజును కోరారు. ఆదివారం వారు ఎంపీని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ప్రస్తుతం నీట్ పరీక్షను ఎన్‌టీఏ నిర్వహిస్తుండడంతో పేపర్ లీక్ అయి మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మహేంద్ర పేర్కొన్నారు. నీట్ పరీక్షను రాష్ట్రాలకు అప్పగించేలా పార్లమెంట్‌లో పోరాటం చేయాలని ఎంపీని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమణ, దశరథ్ నాయుడు, నరేంద్ర, తేజ, తిరుమలేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ముస్లింలపై దాడులను ఖండించాలి



మాట్లాడుతున్న పి.ఇక్బాల్‌హుస్సేన్

కర్నూలు(సెంట్రల్): జూన్ 4వ తేదీ నుంచి దేశంలో పలుచోట్ల ముస్లింలపై విద్వేష పూరిత దాడులు, హింసాత్మక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని,గోమూకదాడులను లౌకిక వాదులు, ప్రజాతంత్ర నాయకులు ఖండించాలని అవాజ్ నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్‌హుస్సేన్, ఎస్‌ఎండీ షరీఫ్ కోరారు. ఆదివారం అవాజ్ కమిటీ కార్యాలయంలో మాట్లాడుతూ..దేశంలో ముస్లింలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మూకలు దాడులు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. నిరాధారమైన ఆరోపణలతో వేధింపులకు గురి చేయడం, ఇళ్లను కూల్చడం, అన్యాయమన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మహానంది: బుక్కాపురం, గోపవరం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. శిరివెళ్ల మండలం గంగవరం గ్రామానికి చెందిన లక్ష్మయ్య బైక్‌పై వెళ్తుండగా గోపవరం వద్ద ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీకొంది. దీంతో లక్ష్మయ్యకు తీవ్రగాయాలై కాలు విరిగింది. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ రామకృష్ణ, రోడ్‌సేఫ్టీ డ్రైవర్ రసూల్ ఘటనా స్థలానికి చేరుకుని లక్ష్మయ్యను చికిత్స నిమిత్తం నంద్యాల ఆస్పత్రికి తరలించారు. మహానంది నుంచి నంద్యాల వెళ్లే మార్గంలో బుక్కాపురం పెట్రోల్ బంక్ వద్ద స్పీడ్ బ్రేకర్ వద్ద ముందు వెళ్తున్న కారును వెనుక వస్తున్న కారు ఢీకొనడంతో కార్లు దెబ్బతిన్నాయి. రంగారెడ్డి జిల్లాకు చెందిన చంద్రనాయక్ కుటుంబం తిరుపతి నుంచి మహానందికి వచ్చి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది.

కనిపించిన నెలవంక... కొలువు దీరిన పీర్లు



ఆస్థానంలో కొలువైన హజరత్ అబ్బాస్‌పీర్లు



విద్యుత్ దీపాలంకరణలో ఆస్థానం

బనగానపల్లె రూరల్: నెలవంక ఆదివారం సాయంత్రం కనిపించడంతో మండల కేంద్రం బనగానపల్లెలోని ఆస్థానంలో హజరత్ అబ్బాస్ పీరు స్వాములు కొలువుదీరాయి. సోమవారం నుంచి ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. ముందుగా బనగానపల్లె నవాబు వంశీయులు నవాబు మీర్ ఫజల్ అలీఖాన్ ఆధ్వర్యంలో నవాబు ఇంటి నుంచి భక్తి గీతాలు ఆలపిస్తూ ఆస్థానం వరకు పీర్లను తీసుకొచ్చారు. అనంతరం వాటిని అందంగా ముస్తాబు చేశారు. పూలదట్టీలు అలంకరించారు. తదనంతరం షియా మతస్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బనగానపల్లె నవాబు వంశీయులు నవాబు మీర్ ఫజల్ అలీఖాన్ ఫాతేహాలు సమర్పించారు. మొహర్రం వేడుకల్లో భాగంగా ఈ నెల 14వ తేదీన చిన్న సరిగెత్తు, 15న మధ్య సరిగెత్తు, 17న జుర్రేరు వాగులో పీర్ల నిమజ్జనంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. మొహర్రం వేడుకలు హైదరాబాద్ తర్వాత బనగానపల్లె పట్టణంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుగుతాయి. హిందూ, ముస్లింలు కలిసి మెలసి జరుపుకుంటారు. కాగా మొహర్రం సందర్భంగా బనగానపల్లె ఆస్తానాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవాలి



డాక్టర్ భరత్‌ను సన్మానిస్తున్న హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్, సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): మధుమేహ వ్యాధిని ఎప్పుడూ నియంత్రణలో ఉంచుకోవాలని ఎండోక్రైనాలజీ డాక్టర్ బి. భరత్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో మధుమేహ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ భరత్ మాట్లాడుతూ జీవనశైలిలో వచ్చిన మార్పులు, మానసిక ఒత్తిళ్లు, ఊబకాయం, వంశ పారంపర్యంగా మధుమేహ వ్యాధి వస్తోందన్నారు. ఈ వ్యాధి వచ్చిన తర్వాత వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడాలని, ఆహార నియమాలు పాటించాలని, ప్రతిరోజూ వ్యాయామం చేయాలని చెప్పారు. ఈ వ్యాధి నియంత్రణలో లేకపోతే కిడ్నీ, గుండె, నరాలు, కళ్లు దెబ్బతింటాయని చెప్పారు. ఈ వ్యాధిని నియంత్రణలో ఉంచుకునేందుకు ప్రస్తుతం అనేక మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం ఆయనను హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు కల్కూర చంద్రశేఖర్, సభ్యులు ఘనంగా సన్మానించారు.

వేగంగా బీరప్ప స్వామి దేవాలయ నిర్మాణం



నేతలకు నగదు అందిస్తున్న సుంకన్న

కర్నూలు(అర్బన్): నగర శివారులోని పెద్దపాడు సమీపంలో ఆదర్శ పాఠశాల పక్కన దాతల సహకారంతో నిర్మిస్తున్న శ్రీ బీరప్ప స్వామి దేవాలయం పనులు వేగంగా జరుగుతున్నాయని జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి తెలిపారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు దాతలు అందించిన ఆర్థిక సహాయంతో గోపురం నిర్మాణం, అమీలియో హాస్పిటల్ అధినేత డా.ప్రసాద్ అందించిన ఆర్థిక సహాయంతో ప్రహరీగోడ నిర్మాణం పూర్తి చేశామన్నారు. గూడూరు మండలం కె. నాగలాపురం గ్రామానికి చెందిన సుంకన్న కూడా రూ.44 వేలు విరాళంగా అందించారన్నారు. ఇంకా చేపట్టాల్సిన పనులు చాలా ఉన్నాయని, దాతలు ముందుకు వచ్చి దేవాలయ నిర్మాణం పూర్తి అయ్యేందుకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బి. వెంకటేశ్వర్లు, నాయకులు కొత్తపల్లె దేవేంద్ర, పెద్దపాడు పుల్లన్న, బీసీ తిరుపాలు, నగర అధ్యక్షుడు తవుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ శాఖ నెలకొల్పిన టవర్లపై 33కేవీ లైన్ లాగే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సోమవారం కూడా ఈ పనులు ఉన్నందున వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈ నాగప్రసాద్ తెలిపారు. అశోక్ నగర్, లేబర్ కాలనీ, మున్సిపల్ ఫిల్టర్ బెడ్స్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు నగరపాలకలో ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే అర్జీ, అధార్ కార్డు జిరాక్స్, మొబైల్ ఫోన్ నంబర్లతో వచ్చి ఫిర్యాదు అందించవచ్చని తెలిపారు.

డీవైఎఫ్‌ఐ నూతన కమిటీ ఎన్నిక

కర్నూలు(సెంట్రల్): డీవైఎఫ్‌ఐ న్యూసిటీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వై.నగేష్ అధ్యక్షతన సమావేశమైన సభ్యులు న్యూసిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా గౌతమ్, హుస్సేన్‌బాషాలను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా విజయ్, సాయి, ఉదయ్, మహేష్, విక్రమ, సహాయ కార్యదర్శులుగా ఇమ్రాన్, వీరేష్, శివశంకర్, సికిందర్, నవన్‌తో పాటు మరో 10 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఎమ్మిగనూరురూరల్: పత్తి సాగులో సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.అశోక్‌కుమార్ సూచించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. జిల్లాలో ముందస్తు వర్షాలకు సాగుచేసిన పత్తి పంట ప్రస్తుతం 20–30 రోజుల దశలో ఉందని సస్యరక్షణ పద్ధతులు పాటించాలని చెప్పారు. ఈ దశలో పంట కలుపు నివారణ కోసం అంతర సేద్యం చేయాలన్నారు. విత్తిన 25–30 రోజులప్పుడు అంతర కృషి చేయటానికి అవకాశం లేనప్పుడు గడ్డి జామి మొక్కల నివారణకు ఎకరానికి 400 మి.లీ క్విజలో ఫాస్ ఇథైల్ 5 శాతం ఇ.సి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వెడల్పులాంటి ఆకు కలుపు సమస్య ఎక్కువగా ఉంటే ఎకరానికి 250 మి.లీ పైరిథయోబ్యాక్ సోడియం 10 శాతం ఇ.సిను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని చెప్పారు. అలాగే ఈ దశలో పత్తి పైరుకు సరైన పోషకాలు అందేలా ఎకరానికి 20 కిలోల నత్రజని (44 కిలోల యూరియా), 10 కిలోల పొటాష్ (16 కిలోల మ్యూరియేట్ ఆఫ్ పొటాష్), 10 కిలోల భాస్వరం (22 కిలోల డైఅమ్మోనియం ఫాస్ఫేట్) ఎరువులు మొక్క మొదలు 7–10 సెం.మీ దూరం 5 సెం.మీ లోతులో వేయాలని చెప్పారు. రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే తెగుళ్ల నుంచి పైర్లను కాపాడుకోవచ్చన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయాలు, రాత్రి కాపలాదారులకు ఉద్యోగ భద్రత కల్పించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు విజయ పేర్కొన్నారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..టీడీపీ ప్రభుత్వం పనిచేస్తున్న కార్మికులను తొలగించి తమ వారిని నియమించుకునేందుకు కుట్ర పన్నుతోందన్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల కార్మికులను తొలగించారన్నారు. ఇందుకు అధికారులు కూడా సహకరిస్తుండడంతో కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. ఈ అంశంపై సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ అంజిబాబు, నాయకులు లలితమ్మ, రజియా,సుజాత, రాజమణి పాల్గొన్నారు.

కళ్ల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్ శర్మ

కర్నూలు(సెంట్రల్): సమాజంలోని ప్రతిఒక్కరూ కళ్ల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ ప్రసాద్ శర్మ సూచించారు. ఆదివారం లక్ష్మీనగర్‌లోని వికాస్ స్కూలులో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, సిరి, శ్రీదత్త మహిళా ఐక్య సంఘాల నిర్వహణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ బి.స్వాతి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రసాద్ శర్మ మాట్లాడుతూ..సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రెండునెలలకొకసారి చివరి ఆదివారం బీపీ, షుగర్, మూర్ఛ వ్యాధులకు రూ.200కే రెండునెలలకు సరిపడ్డా మందులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సుందరయ్య కేంద్రం నాయకులు జేఎస్ శేషయ్య,రంగస్వామి, ఎల్లాగౌడ్, శేషాద్రి పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, దోమతెరల పంపిణీ



దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని పలువురు పేదలకు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ ఆదివారం దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేశారు. గాయత్రి ఎస్టేట్‌లోని తన క్లినిక్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కలుషిత నీరు, దోమకాటుకు గురిగాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, కలుషిత నీరు తాగడం వల్ల కలరా, కామెర్లు, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అందుకే ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని చెప్పారు.

■అ'పూర్వ' కలయిక



గురువులతో పూర్వ విద్యార్థులు

కోవెలకుంట్ల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1990–91 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఒక వేదికపై చేరారు. హైదరాబాదు, బెంగళూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, వ్యాపార రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. దాదాపు 34సంవత్సరాల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు సంతోషంగా గడిపారు. అప్పట్లో చదువు చెప్పిన గురువులు ఓబులేసు, నాగేంద్రప్ప, సుబ్బారెడ్డి, జీవీ సుబ్బారెడ్డి, ముత్తోజ్ వీరబ్రహ్మం తదితరులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించి గురుభక్తి చాటుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అమర్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, షర్ఫుద్దీన్, ప్రసాద్, తిరుపాలు, భరత్, అబ్దుల్‌హై తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి క్రాసింగ్ పైపులైన్లను తొలగించండి



తాగునీటి క్రాసింగ్ పైపులైన్లను పరిశీలిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు

కర్నూలు (టౌన్): మురుగు కాల్వల వద్ద తాగునీటి పైపులైన్లను గుర్తించి వాటిని తక్షణం తొలగించాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. ఆదివారం కమిషనర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. నగరపాలక ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డీఈఈలు గోపాలక్రిష్ణ, నరేష్, గిరిరాజు, కృష్ణలత, రాజశేఖర్ ఏఈలు ప్రవీణ్‌కుమార్ రెడ్డి, భానుప్రకాష్, జనార్దన్, ట్యాప్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి నగరంలోని పలు ప్రాంతాల్లో మురుగు కాల్వల వద్ద ఉన్న తాగునీటి పైపులైన్‌లను గుర్తించారు. సమస్య పరిష్కారానికి క్రాసింగ్ పాయింట్లను డీఈఈలు పరిశీలించారు. తొలగించే చర్యలకు శ్రీకారం చుట్టారు. మురుగుకాల్వల్లో తాగునీటి పైపులు ఉండటంతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని కమిషనర్ అన్నారు. వెంటనే పైపులైన్ లీకేజీలను అరికట్టాలన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ



చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు

కర్నూలు (టౌన్): మార్షల్ ఆర్ట్స్ కరాటే నేర్చుకుంటే ఆత్మరక్షణతో పాటు మానసిక ధైర్యం, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. రామాంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జెన్ సిటీర్యూ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులకు ఆయన బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కరాటే క్రీడకు మంచి ఆదరణ ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కోలా ప్రతాప్ పాల్గొన్నారు.

కొత్తూరుకు పోటెత్తిన భక్తులు



స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు చేస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తుల తాకిడి పెరిగింది. తెల్లవారుజామున నుంచే భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. ఉదయం 8 గంటలకే క్యూలైన్లు నిండిపోయాయి. స్వామివారి దర్శనం కోసం దాదాపు 4 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు 350కి పైగా అభిషేకాలు జరిగాయని అధికారులు చెప్పారు. 8 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు. ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్యశిబిరం



కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ జేజే ప్రవీణ్

కర్నూలు(హాస్పిటల్): రిటైర్డ్ సీనియర్ సిటిజన్ సర్వీస్ సొసైటీ, కృష్ణానగర్ వారి ఆధ్వర్యంలో సొసైటీ సభ్యులకు, సాధారణ ప్రజలకు ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కృష్ణానగర్‌లోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ వైద్యశిబిరంలో కంటి చూపునకు సంబంధించిన పరీక్షలు డాక్టర్ జేజే.ప్రవీణ్ నిర్వహించారు. కంటి చూపునకు సంబంధించి ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సహాయ ఖజానాధికారి జి. రఘువీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సొసైటీకి పి. హనుమంతరెడ్డి వాటర్ డిస్పెన్సర్‌ను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షుడు జె.విశ్వేశ్వరయ్య, కార్యదర్శి సీవీ సుబ్బారావు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' నిధులు విడుదల చేయాలి

నందికొట్కూరు: రైతులకు అన్నదాత సుఖీభవ పథకం నిధులు వెంటనే విడుదల చేయాలని సీపీఐ ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, నాయకులు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఏపీ రైతు సంఘం కార్యాలయం ఆవరణలో నియోజకవర్గస్థాయి నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు రైతు భరోసా తరహాలో అన్నదాత సుఖీభవ పథకాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి రైతు ఖరీఫ్ సీజన్‌లో వేసే పంటకు పెట్టుబడులకు అన్నదాత సుఖీభవ పథకం అందించాలని కోరారు. పెట్టుబడి సహాయం కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇంత వరకు రైతు బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వం జమ చేయలేదని గుర్తు చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు గోపాల్, నాగశేషులు, తిరుపాలు, మద్దిలేటి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇంకెప్పుడు?

- పాఠశాలలు ప్రారంభమైనా విద్యార్థులకు అందని యూనిఫాం
- గతేడాది మొదటిరోజే పంపిణీ చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- విద్యార్థులకు తప్పని ఎదురుచూపులు



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ప్యాపిలి: విద్యార్థులకు మళ్లీ అవస్థలు మొదలయ్యాయి. జూన్ 13న పాఠశాలలు పునః ప్రారంభమైనా విద్యార్థులకు పూర్తిస్థాయిలో పుస్తకాలు కూడా అందలేదు. ఇక యూనిఫాం ఊసేలేదు. దీంతో విద్యార్థులకు ఎదురు చూపులు తప్పడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలను కల్పించింది. నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసింది. పాఠశాలలు పునఃప్రారంభమైన రోజే జగనన్న విద్యా కానుక పేరిట కిట్లు పంపిణీ చేసేది. కిట్లలో పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, సాక్సులు ఉండేవి. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చిన టీడీపీ సర్కారు విద్యార్థులను పట్టించుకోవడం లేదు. పాఠశాలలు పునః ప్రారంభమై దాదాపు నెల రోజులవుతున్నా విద్యార్థుల అవసరాలపై దృష్టి సారించడం లేదు. జగనన్న విద్యా కానుక పేరును మార్చిందేకాని విద్యార్థులకు యూనిఫాం అందజేయలేకపోయింది. కిట్లలో కేవలం పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, ఇతర వస్తువులు ఉన్నాయి. యూనిఫాం మాత్రం లేకపోవడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

యూనిఫాం కోసం ఎదురు చూపులు

పేద, ధనిక తారతమ్యం ఉండకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం తప్పనిసరి చేసింది. అయితే పంపిణీలో టీడీపీ ప్రభుత్వం జాప్యం చేస్తుంది. మండలంలో 64 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా 1 నుంచి 10 వ తరగతి వరకు 6,700 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులందరికీ ప్రభుత్వం రెండు జతల యూనిఫాంకు సరిపడా బట్ట (క్లాత్) పంపిణీ చేసి కుట్టు కూలీ కూడా ఇవ్వాల్సి ఉంది. అయితే మండలంలో 6,700 విద్యార్థులకు గాను ఇప్పటికీ ఒక విద్యార్థికి కూడా యూనిఫాం క్లాత్ పంపిణీ చేయలేదు. ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను అడుగుతున్నా స్పష్టమైన సమాధానం కరువైంది. అసలు యూనిఫాం క్లాత్ ఇస్తారా..ఇవ్వరా అనే సందిగ్ధత నెలకొంది. ఇదివరకే పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు గతేడాది ఇచ్చిన యూనిఫాంతో సరిపెట్టుకుంటున్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదే పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో పరిస్థితి ఏమిటనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు సామాన్యులు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూనిఫాం పంపిణీకి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వారంలో పంపిణీ చేస్తాం



విద్యార్థులకు విద్యాకిట్లను పంపిణీ చేస్తున్నాం. అయితే కిట్లలో యూనిఫాం క్లాత్ రాలేదు. నంద్యాల జిల్లాలో కొన్ని మండలాలకు మాత్రమే యూనిఫాం వచ్చినట్లు తెలిసింది. ప్యాపిలి మండలానికి రావాల్సి ఉంది. యూనిఫాం మరో రెండు రోజుల్లో వచ్చే అవకాశం ఉంది. యూనిఫాం రాగానే అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తాం. సాధ్యమైనంత వరకు ఈ వారంలోనే విద్యార్థులకు పంపిణీ చేస్తాం.

– వెంకటేశ్ నాయక్, ఎంఈఓ

యాగంటి క్షేత్రానికి కలశాలతో పాదయాత్ర



కలశాలతో యాగంటిక్షేత్రానికి చేరుకున్న భక్తులు

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని రవ్వలకొండపై వెలసిన హట్టిముని స్వామి ఆలయం నుంచి ఆదివారం జల కలశాలతో భక్తులు యాగంటి క్షేత్రానికి పాదయాత్రగా వెళ్లారు. ఉదయం వివిధ గ్రామాల నుంచి హట్టిముని స్వామి ఆశ్రమం వద్దకు చేరుకున్న భక్తులు అక్కడి నుంచి కలశాలను తలపై పెట్టుకొని శివనామస్మరణ భజన చేసుకుంటూ యాగంటిపల్లె, సాదుకొట్టం, పాతపాడు గ్రామాల మీదుగా యాగంటి క్షేత్రం చేరుకున్నారు. వీరికి ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శివుడికి కలశాలల జలంతో అభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని స్వామివారిని కోరుకున్నారు. పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమామహేశ్వర స్వామి నిత్యాన్నదాన, రైతు అన్నదాన సంస్థలు భక్తులకు అన్నదానం చేశారు.